# మొగమహారాజు

అది నల్లగొండ చౌరస్తా. అక్కడే ఎర్ర బస్సు దిగాల్సింది నా భార్య. రెండురోజుల క్రితం ఊరి దగ్గర ఉన్న తన చిన్నమ్మను చూసిరాను వెళ్లింది. ఈరోజు సాయంత్రం ఐదుగంటలకు వస్తానంది. తప్పనిసరైతే ఆరోగ్యం క్షీణించిన వాళ్ల చిన్నమ్మ (మా చిన్న త్తను) తోల్కొని వస్తానంది. అందుకే నేను వాళ్లకోసం ఎదురుచూస్తూ ఆ చౌరస్తా దగ్గర నిలబడ్డాను.



అదే బస్టాండ్‌లో 'డిపో' నుండి వచ్చి ఊర్లవైపు వెళ్లే బస్సు కోసం ఎదురుచూస్తూ ఓ జంట నిలుచుంది. అతను సంవత్సరం పసివాణ్ని ఎత్తుకొని ఉన్నాడు. ఆ పసివాడి ముక్కునుండి చీమిడి కారుతోంది. ఆయాసంతో ఊపిరి ఎగపోస్తున్నాడు. చాలా నీరసంతో మెడను వాడి తండ్రి భుజంమీద వాల్చేస్తూ మాటిమాటికీ తల్లివైపు చేతులు చాస్తున్నాడు. అతను ఆ పసివాణ్ణి ఆమెకు ఇవ్వకున్నాడు. ఆమె కొంగుతో మాటిమాటికీ కళ్లు తుడ్చుకుంటోంది. కొడుకును చూస్తూంది. ఏడుస్తోంది. కొడుకు భద్రమని చెపుతూంది. మరోసారి తనకు ఇవ్వమని అడుగుతూంది. అతను 'భర్త' ఒక్కోసారి గట్టిగా కేకలేస్తున్నాడు. మళ్లీ జనాన్ని చూసి మెల్లగా మాట్లాడుతున్నాడు. ఆమె ఏడుస్తూనే వుంది.

ఇంతలో నల్లగొండ బస్ వచ్చింది. ఆ భర్త ఇక ఎక్కుమని చెప్పాడు. ఆమె కొడుకు దిక్కే దిగులుగా చూస్తోంది. వాడూ ఏడుస్తూ రెండు చేతులు తల్లివైపు చాపాడు. భర్త నిర్దాక్షిణ్యంగా భార్యను బస్సులోకి నెట్టేశాడు. బస్సు కదిలింది. ఆమె ఏడుస్తూనే బస్సు కిటికీలో నుండి కొడుక్కి 'టాటా' చెప్పింది. ఆ పసివాడూ ఏడుస్తూనే తల్లికి 'టాటా' చెప్పాడు. ఎంత తెలివో ఏడ్పు టక్కున ఆపేశాడు! బస్సు కనిపించకుండా కదిలిపోయింది.

నేను ఎదురుచూస్తున్న బస్సులో నా భార్య రాలేదు. ఓ అరగంట గడిస్తేనేగాని మరో బస్ రాదు. ఇంతవరకు నేను చూస్తున్న భర్త రోడ్డు క్రాస్‌చేసి వెళ్లిపోయాడు మరోవైపు. నేను ఇంకా అక్కడే నిల్చోలేక పక్కనేవున్న అంబికా హోటల్లో 'టీ'కోసం కూర్చున్నాను. ఇంతలో ఆ భర్త చంటివాడితో అక్కడికే వచ్చాడు. నా ఎదురుగుండా ఉన్న ఖాళీ సీట్లో కూర్చున్నాడు. పసివాడికి టేబుల్ మీదున్న నీళ్ల గ్లాసుతో నీళ్లు తాగించాడు.

**భూపాల్**

నేను ఇంకా ఉండబట్టలేక "ఏమైందీ! మీ బాబుకి జ్వరంగా ఉందా? బాగా నీరసించి వున్నాడు?" అడిగాను.

అతని కళ్లూ, ఒళ్లూ తాగుబోతుల లక్షణం తెలుస్తూంది. ముఖంలో సారా పాకెట్ల నిగనిగ షర్టు జేబులో చిత్తుకాగితాల్లా మడిచి కుక్కేసిన రెండూ, ఒకటీ రూపాయల నోట్లూ- పైకి కనిపిస్తున్నాయి. 'టీ' వచ్చింది. పసివాడికి సాసర్‌లోపోసి నోటి దగ్గర పెట్టబోతే వాడు తల తిప్పేశాడు. ఇక, అతనే 'టీ' పూర్తిచేశాడు.

నన్ను నిర్లక్ష్యంగా చూస్తూ "ఆఁ! అవును. జ్వరమొచ్చింది. కండ్లకు పస్కలొచ్చినయ్" అన్నాడు.

పసివాడు ముక్కులు ఎగచీదుతూ, అమాయకంగా దిక్కులు చూస్తున్నాడు. ఇతను ఒక 'ఛా' ఆర్డర్ చేశాడు. చూస్తే అతని కళ్లూ, ఒళ్లూ తాగుబోతుల లక్షణం తెలుస్తూంది. ముఖంలో సారా పాకెట్ల నిగనిగ షర్టు జేబులో చిత్తుకాగితాల్లా మడిచి కుక్కేసిన రెండూ, ఒకటీ రూపాయల నోట్లూ- పైకి కనిపిస్తున్నాయి. 'టీ' వచ్చింది. పసివాడికి సాసర్‌లోపోసి నోటి దగ్గర పెట్టబోతే వాడు తల తిప్పేశాడు. ఇక, అతనే 'టీ' పూర్తిచేశాడు. హోటల్ బేరర్ రాగానే నా టీ డబ్బులూ, నా ఎదురుగా ఉన్న అతని డబ్బులూ నేనే ఇచ్చేశాను. అతను నా దిక్కు కొంచెం కోపంగానే చూశాడేగానీ, కృతజ్ఞతలేదు. నేను ఆశించలేదు. "పావం! బాబు చాలా నీరసంగా ఉన్నాడు. పస్కలు ఆలస్యం చేస్తే చాలా ప్రమాదం. మందుపోయించావా?" అడిగాను.

"లేదు. ఈరోజే తెలిసింది పస్కలని"

"మరి వీడి తల్లి ఎటుపొయ్యిందీ? పాపం నీ ఒక్కనికి వీన్ని చూసుకోడం కష్టంగదా! పసిపిల్లలు మారం చేస్తారు."

"మందులు కొనాలంటే పైసల్లేవు. పరీక్షలకూ లేవు. ఒద్దంటే నాతోటి కొట్లాడి తల్లిగారింటికాడ నాల్గు నెల్లుండి వీడికి, ఈని తల్లే పస్కలు తెప్పించింది. అందుకే గట్టిగా బెదిరిచ్చిన ఇప్పుడే బస్సెక్కి మల్ల ఊరికి పోయింది తండ్రి దగ్గర పైసలు అడుకొస్తనని."

నేను అతనికి పూర్తిగా కొత్తవాణ్ణి. ఐనా చెప్పేశాడు. ఐతే నేను గంట నుండి విషయమంతా గమనిస్తున్నానని అతనికి తెలియదు. అతను చెప్పే విషయం అబద్ధమని, ఆమె తానుగా వెళ్లలేదని నాకు తెలుసు. ఐనా నేనేమనను? ఏదో బుద్ధి చెప్పాలని వుంది. ఇంకా కథ బయటకి తీయవచ్చు. గట్టిగా మందలించవచ్చు. తిట్టనూ మాటలున్నాయి. కానీ, ఆ 'మగమహారాజు'ను అనే అహంకారం వాడిలో ఎంత రాక్షసంగా వుందో ఆమెను బస్‌లోకి నెట్టేసినప్పుడే అర్థమైంది. నేను మౌనం వహించానంతే... ఐతే రేపు ఆమె తిరిగొస్తుందా!! వచ్చే తీరుతుంది. ఎందుకంటే... ఇప్పుడు భర్తకన్నా ఆమెకు తన కొడుకు ఆరోగ్యం ముఖ్యం కనుక...

ఇంతలో నేను ఎదురుచూస్తున్న బస్ వచ్చింది. నేను లేచి హోటల్ బయటకి నడిచాను. ●




